క్లుప్తంగా

బెల్ట్ దుకాణంపై దాడి

- 19 మద్యం సీసాలు పట్టివేత

చీడికాడ : మండలంలోని వరహాపురంలో మద్యం బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో ఆదివారం రాత్రి వరహాపురంలోని పెచ్చేట్టి అప్పల నాయుడు ఇంటిపై దాడి జరపగా 19 మద్యం సీసాలు గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు బాగు చేయాలి



సర్పంచ్ కళావతికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మాడుగుల : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు మెరుగు పరచాలంటూ గ్రామస్తులు సోమవారం సర్పంచ్ ఎడ్ల కళావతికి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో బస్సులు అక్కడకు వెళ్లకపోవడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారిందన్నారు. పంచాయతీ పాలక వర్గం స్పందించి తీర్మానం చేసి , రోడ్డు బాగు చేయాలని వినతి పత్రంలో కోరారు.

హిందూ శంఖారావం విజయవంతం చేయాలి

మాడుగుల రూరల్ : వచ్చే ఏడాది జనవరి 5 న విజయవాడలో జరిగే హిందూ శంఖారావం కార్యక్రమం విజయవంతానికి మూడు గ్రామాల్లో మంగళవారం రాత్రి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు హైందవ శంఖారావం మండల కన్వీనర్ రాపేట రామకొండలరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 7గంటల వరకు ఎం.కోటపాడు, వల్లాపురం గ్రామాలకు కలిపి ఎం.కోటపాడు రామాలయంలో, రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు వంటర్లపాలెం రామాలయం వద్ద, 8 నుంచి 9 వరకు కె.జె.పురం రామాలయం వద్ద సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాలకు వీహెచ్‌పీ, ఎస్ఎస్‌పి, ఆర్.ఎస్.ఎస్, బీజేపీ మండల, గ్రామ కమిటీల సభ్యులు, ప్రఖండ ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



కె.కోటపాడు ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందిస్తున్న కొండలరావు

కె.కోటపాడు : యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కె.కోటపాడులో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా జరిపారు. మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పడాల కొండలరావు ఆధ్వర్యంలో కె.కోటపాడులో సోనియాగాంధీ జన్మదిన కేక్‌ను కట్ చేసి, అనంతరం సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకుడు కళిరెడ్డి గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం



సేంద్రియ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను విక్రయిస్తున్న మహిళలు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పప్పు దినుసులను వినియోగించాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ కోరారు. మునగపాక మండలం గణపర్తికి చెందిన పలువురు మహిళలు ఎటువంటి రసాయనిక ఎరువులను వినియోగించకుండా ఆర్గానిక్ పద్ధతులతో సాగు చేసి పండిన ఉత్పత్తులను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అమ్మకాలు చేస్తున్నారు. తాజా కూరగాయల తో పాటు బెల్లం, పప్పు దినుసులతో తయారు చేసిన పలు రకాల వంటకాలు, అలాగే బియ్యం, తదితర ఉత్పత్తులు ఈ స్టాల్‌లో అందుబాటులో ఉన్నాయి. తాజా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రతి సోమవారం విక్రయించనున్నట్టు స్టాల్ నిర్వాహకులు తెలిపారు. ప్రజలు కూడా మారుతున్న కాలంతో పాటు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రసాద్ సూచించారు.



వడ్డాదిలో జోరుగా ఖరీఫ్ వరి కోతలు



కస్పా పొలాల్లో మెషిన్‌తో వరి కోతలు

పొలాల్లోనే ధాన్యలక్ష్మి..!



వడ్డాదిలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేక ప్రైవేటు వ్యాపారికి అమ్మకానికి ఉంచిన ధాన్యం

- పలు గ్రామాల్లో జోరుగా వరి కోతలు, నూర్పులు
- తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- రైతుల ఆవేదన

ఇటీవల తుపాను వర్షానికి పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి పంట దెబ్బతింది. వాతావరణం చక్కబడ్డాక మళ్లీ రైతులు జోరుగా వరికోతలు కోసి నూర్పుళ్లు మొదలుపెట్టారు. అయితే పంటను అమ్ముదాం అంటే నేటికీ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెబుతున్నా బుచ్చెయ్యపేట మండలంలో మాత్రం నేటికీ ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా తెరుచుకోలేదు. దీంతో రైతులకు ప్రైవేటు వ్యాపారులే దిక్కయింది.

బుచ్చెయ్యపేట : మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరుచుకోలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంట ఆశాజనకంగా ఉంది. గత వారం పది రోజులుగా రైతులు వరి పంట కోసి ధాన్యం నూర్పులు చేస్తున్నారు. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల వరకు ధాన్యం దిగుబడి వస్తుంది. బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న 35 పంచాయతీ గ్రామాల పరిధిలో ఈ ఏడాది 6,200 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు వరి పంట సాగు చేశారు. ఇప్పటికే వడ్డాది, గంటికొర్లాం, పొట్టిదొరపాలెం, లూలూరు, విజయరామరాజుపేట, మంగళాపురం, కుముదాంపేట, రాజాం, కందిపూడి, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల్లో రైతులు వరి పంట కోతలు జోరుగా సాగుతున్నాయి.

గత ఏడాది 450 టన్నుల సేకరణ

గతంలో మండలంలో వడ్డాది, పొట్టిదొరపాలెం, లోపూడి, విజయరామరాజుపేట రైతు భరోసా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత ఏడాది 450 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తరలించి రైతులకు నగదు బట్వాడా చేశారు. ఈ ఏడాది రైతులు వరి కోతలు ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోక ప్రైవేటు వ్యాపారులకు వచ్చిన ధరకు అమ్ముకుంటున్నారు.

సిబ్బందినీ నియమించలేదు..

ఈ ఏడాది 17 శాతం కన్న తేమ తక్కువ ఉన్న ఎ గ్రేడ్ రకం ధాన్యంకు కింటాకు రూ.2,320, బి గ్రేడ్ ధాన్యంకు రూ.2,300గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామని తెలపడంతో పలు గ్రామాల రైతులు ధాన్యం అమ్మడానికి ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోగా ధాన్యం రకంను, తేమ శాతం పరిశీలించి మిల్లుకు తరలించే డేటా ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్‌లను ఇప్పటి వరకు నియమించలేదు. మండలంలో తక్షణం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారులను వివరణ కోరగా మండలంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

రేషన్ డీలర్ల పోస్టులకు నోటిఫికేషన్

మాడుగుల : మండలంలో మూడు రేషన్ డీలర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు, తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండలంలో పోతనపూడి, జమ్మాదేవిపేటతో పాటు శంకరం పంచాయ తీ గొప్పూరులో కొత్తగా రేషన్ డిపో ఏర్పాటుకు నోటిపికేషన్ జారీ చేయడం జరుగుతుందన్నారు. పోతనపూడి(ఓసీ), జమ్మాదేవిపేటకు(ఈడబ్ల్యూఎస్)గొప్పూరుకు(బీసీఈ) కేటగిరీలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ లోపు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయానికి సాయంకాలం 5 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. రాత పరీక్ష ఈ నెల 26వ తేదీన, ఇంటర్వ్యూ 27 వ తేదీన ఉంటుందన్నారు. హాల్‌టికెట్ల ద్వారా పరీక్ష కేంద్రం తెలియ జేస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 16 డిసెంబరు 2024 నాటికి 40 ఏళ్లలోపు ఉండి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు



వి.సంతపాలెంలో ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్ : గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించారు. మాడుగుల సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో గైనిక్ వైద్యురాలు డాక్టర్ కర్రి రేవతి గర్భిణులకు బీపీ, సుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో 59 మందిని పరీక్షించారు. కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రసాదు పాత్రుడు, లీలాప్రసాదు, కింతలి పీహెచ్‌సీలో వైద్యాధికారి నాగదివ్య గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

కె.కోటపాడు : చౌడుపాడ పీహెచ్‌సీ పరిధిలో సోమవారం గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత సమస్య లేకుండా బెల్లంతో కూడిన ఆహార పదార్థాలతో పాటు ఆకుకూరలను ఆహారంలో ఉండేటట్టు చూసుకోవాలని తెలిపారు. ప్రసవాలను తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ అచ్చియ్యమ్మ, ఏఎన్ఎంలు సన్యాసమ్మ, చిన్నమ్మలు, కుమారి పాల్గొన్నారు.

కె.కోటపాడు : లంకవానిపాలెం పీహెచ్‌సీ పరిధి వి.సంతపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య పరీక్షలను జరిపారు. 164 మందికి వైద్యంతో పాటు ఉచితంగా మందులను అందించారు. గర్భిణులకు ఏఎన్ఎంలు ఆరోగ్య తనిఖీలను నిర్వహించి జాగ్రత్తలు తెలిపారు. పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పర్యవేక్షించారు.

నేడు అర్జునగిరిలో సదస్సు

చీడికాడ : అర్జునగిరిలో మంగళవారం సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. అర్జునగిరి సచివాలయంలో ఉదయం 9 గంటల నుంచి మజ్జాహ్నం 1గంట వరకు తిరిగి మజ్జాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు జరుగుతుందన్నారు.రైతులు ఈ సదస్సును ఉపయోగించుకోవాలన్నారు.రెవెన్యూ సమస్యలుంటే సదస్సులో అర్జీలు అందించాలని ఆయన కోరారు.

600 ఎకరాల్లో వరి కోతలు



కొండలఅగ్రహారం వద్ద జరుగుతున్న వరికోతలు

మాకవరపాలెం : వరికోతలను రైతులు ముమ్మరం చేశారు. మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు 1410 హెక్టార్లలలో వరిసాగు చేశారు. అయితే గత వారంలోనే కోతల కోసేందుకు ఏర్పాట్లు చేసుకున్న రైతులకు తుపాను హెచ్చరికలు అడ్డుతగిలాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో రైతులు కోతలు కోసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు మండలంలోని కొండలఅగ్రహారం, తూటిపాల, తామరం, మాకవరపాలెం, పైడిపాల, లచ్చన్నపాలెం, లచ్చన్నపాలెం, పి.పి.అగ్రహారం, తదితర ప్రాంతాల్లో సుమారు 600 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మరో 10 రోజుల్లో అన్ని గ్రామాల్లోనూ కోతలు పూర్తవుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

భూ సమస్యల పరిష్కారమే సదస్సుల ఉద్దేశం



ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సులో పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ



కింతాడలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ భాగ్యవతి, ఎంపీపీ జగన్‌మోహన్

జిల్లేడుపూడి గ్రామసభలో ఆర్డీవో రమణ

నాతవరం : రెవెన్యూ గ్రామ సదస్సులు ద్వారా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి చక్కటి అవకాశమని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ అన్నారు. జిల్లేడుపూడి పంచాయతీలో సర్పంచ్ లాలం రమణ అధ్యక్షతన సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామసభలో రైతులు చేసుకున్న దరఖాస్తులను వారి సమక్షంలోనే పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. నిబంధనల ప్రకారం అర్జీలకు పరిష్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నర్సీపట్నం : భూ సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని డిప్యూటీ తహసీల్దార్ నరేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలో చెట్టుపల్లి సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ నమోదు, మ్యూటేషన్, పాస్‌పుస్తకాలకు సంబంధించి 21 ఫిర్యాదులు వచ్చాయని డీటీ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నం , సర్పంచ్ నూకరత్నం, ఆర్ఐ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : కింతాడ గ్రామంలో తహసీల్దార్ భాగ్యవతి సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ 8 మంది అర్జీలను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ జగన్‌మోహన్ మాట్లాడుతూ ఫిర్యాదులపై అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, పల్లా రాజేష్, కన్నూరు సూర్యనారాయణ, బండారు నరసింహ నాయుడు, వీఆర్వో జయశ్రీ, కిషోర్, సచివాలయ సర్వేయర్ మణిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : తెనుగుపూడిలో సర్పంచ్ తాడి సామాలు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ లక్ష్మీదేవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 37 మంది దరఖాస్తులు అందజేశారు. ఉప సర్పంచ్ పెదనాయుడు, మండల సర్వేయర్ గోవిందరాజులు, సర్వేయర్ సతీష్ పాల్గొన్నారు.

మాకవరపాలెం : బూరుగుపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 47 దరఖాస్తులు అందాయి. ఈ గ్రామంలోని రామాలయం వద్ద సోమవారం జరగిన సదస్సులో భూ సమస్యలపై రైతులు వినతులు అందించారు. గతంలో సుమారు 60 మంది దళితులకు 28 ఎకరాలకు పాసు పుస్తకాలు ఇచ్చినా, వెబ్ ల్యాండ్‌లో నమోదు కాలేదని రైతులు తెలిపారు. కార్యక్రమంలో డీటీ సోమశేఖర్, సర్పంచ్ వెంకటరమణ, ఆర్ఐ జెట్టి, వీఆర్వో దేవకాంత పాల్గొన్నారు.

రోలుగుంట: రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో సోమవారం కొమరవోలులో తహసీల్దార్ నాగమ్మ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూముల క్రయ విక్రయాలు, వంశ పారంపర్యంగా భూములు కుటుంబ సభ్యులకు ఎలా సంక్రమిస్తాయో రైతులకు అవగాహన కల్పించారు. వారసత్వ భూముల విషయంలో గొడవలకు తావు లేకుండా ఎలా పంపకాలు చేసుకోవాలో వివరించారు. రైతుల నుంచి 18 వినతులను రామ్మూర్తి నమోదు చేసుకున్నారు. మండల సర్వేయర్ తవుటునాయుడు, సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ రామన్, మాజీ సర్పంచ్ చెల్లంనాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: కుమారపురం, నాగాపురం గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెండు రెవెన్యూ గ్రామాల నుంచి సుమారు 25 వరకు రైతుల నుంచి తహసీల్దార్ శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు. డీటీ చైనులు, మండల సర్వేయర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : అవురువాడ పంచాయతీ పరిధిలో రెండు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో అయా గ్రామాలుకు చెందిన రైతులు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు జగదీశ్, రీసర్వే డీటీ గణపతిరావు, వీఆర్ఓ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు

- మిషన్ల ద్వారా వరి కోతలు కోస్తున్న వైనం
- వెంటాడుతున్న తుపాను భయం

మాడుగుల రూరల్: తుఫాన్ భయంతో రైతులు వరి కోతలు కోస్తున్నారు. ఫెంగాల్ తుఫాన్ ముప్పు తప్పిందంటే ఇప్పుడు మరల ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్ప పీడన ప్రభావంతో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ కేంద్రం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే 100 శాతం వరి పంట పూర్తిగా పండి వుందని, కోతకు సిద్ధంగా ఉంది. అయితే తుఫాన్ ప్రభావం అయినా సరే రైతులు వరి కోతలు కోసి, పంట పొలాల్లో వరి కుప్పలు పెడుతున్నారు. కొన్ని చోట్ల అక్కడిక్కడే నూర్పులు చేస్తున్నారు. ప్రస్తుతం వరి కోతలు ఒకేసారి కోయడంతో వ్యవసాయ కూలీలు కొరత ఎర్పడింది. వరి కోత కోసే యంత్రాలతో కొన్ని గ్రామాల్లో వరి కోతలు కోస్తున్నారు.

సీపీఎం జిల్లా మహా సభల పోస్టర్ విడుదల



మాడుగులలో సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలంటూ పోస్టరును విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల: సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని, ఆ పార్టీ మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద మహాసభల పోస్టరును అవిష్కరించారు. ఏడాదికి ఒక్కసారి జరిగే ఈ సభలను వియవంతం చేయాలని ప్రజలను కోరారు. నూతనంగా ఏర్పడ్డ అనకాపల్లి జిల్లాను అభివృద్ధి చేయాలని, గోవాడ సుగర్‌ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని, జీడి పంటలకు మద్దతు ధరను ప్రకటించి రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఈ మహా సభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కె.భవానీ, ఎస్.ఘాటీలు, పి.జగన్నాథరావు, ఎం.అప్పారావు, పి.అయ్యప్ప, సీహెచ్. సత్యనారాయణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా గుట్కాల విక్రయాలు

చోడవరం కేంద్రంగా జోరుగా వ్యాపారం



షాపులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఖైనీ, పాన్‌మసాలా, గుట్కా ప్యాకెట్లు

చోడవరం: ప్రాణాంతకమైన మత్తు పదార్థాల అక్రమ వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. ఒక పక్క గంజాయి అక్రమ రవాణా ఏజెన్సీ నుంచి యథేచ్ఛగా సాగుతుండగా మరో పక్క నిషేధిత ఖైనీ, గుట్కా, పాన్‌పరాక్, తంబాకు వంటి మత్తు పదార్థాలు దుకాణాల్లో జోరుగా అమ్ముతున్నారు. ఇవి ఇక్కడ తయారు కానప్పటికీ ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా దిగుమతి చేసి ప్రతి కిల్లీ షాపుల్లోనూ వీటిని అమ్ముతున్నారు. రెండు నియోజకవర్గాలకు ప్రధాన కేంద్రంగా పాడేరు ఏజెన్సీకి ముఖద్వారాగా ఉన్న చోడవరం పట్టణంలో ఈ ఖైనీ,గుట్కాల విక్రయం జోరుగా సాగుతోంది. చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు, కోట వీధి, వ్యాపార వీధి, పాతబస్టాండ్ జంక్షన్, చినబజార్, కాలేజీ జంక్షన్, కొత్తూరు జంక్షన్ ప్రాంతాల్లో కొన్ని షాపుల్లో ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ హోల్‌సేల్ వ్యాపారం యదేచ్ఛగా జరుగుతోంది. ఇక్కడ నుంచి పాడేరు ఏజెన్సీ, మాడుగుల, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ ప్రాంతాలకు కూడా ప్రత్యేక వాహనాల్లో ఇతర నిత్యవసర సరుకుల మధ్యలో పెట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం. గతంలో రూ. 5 ఉండే ఒక్కో ప్యాకెట్ ధర ఇప్పుడు రూ.20కి అమ్ముతున్నారు. దొంగచాటుగా అమ్ముతున్నందున అదనంగా ప్యాకెట్ దగ్గర రూ.10 నుంచి15 వరకూ లాభం వేసుకొని కిల్లీ షాపుల్లో వీటిని అమ్ముతున్నారు. ఈ మత్తు పదార్థాలకు బానిసలైన వారు అవి దొరికితే చాలు ఎంతైనా ఇచ్చి కొనుక్కొని తినుతుండడంతో వీటికి గిరాకీ కూడా ఎక్కువగానే ఉంది. కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం వీటిని నిషేధించినా అమ్మకాలు మాత్రం యథేచ్ఛగానే సాగుతున్నాయి. వీటిని పట్టుకోవాల్సిన పోలీసు, టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వెంటనే వీటి విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విస్తృతంగా దాడులు చేస్తాం: సీఐ అప్పలరాజు

గుట్కా, ఖైనీ ప్యాకెట్ల అమ్మకాలు పూర్తిగా నిషేధించడం జరిగిందని, వీటిని అమ్మిన వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ అప్పలరాజు తెలిపారు. ఇకపైనా మరింత నిఘా పెంచి దాడులు చేసి విక్రయించే వారిని అరెస్టు చేస్తామని అన్నారు.

అమ్మవారి వారి రథం ఊరేగింపు



ఏఎల్‌పురంలో అమ్మవారి విగ్రహం ఊరేగిస్తున్న దృశ్యం

గొలుగొండ : విజయవాడ కనకదుర్గ అమ్మవారి రథం ఊరేగింపు కార్యక్రమం ఏఎల్‌పురంలో ఘనంగా నిర్వహించారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి ఈ రథం ప్రారంభం కాగా ప్రతి గ్రామంలో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుంది. సోమవారం ఏఎల్‌పురం గ్రామంలో వారపు సంత కావడంతో అమ్మవారి ఊరేగింపునకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారి రథానికి పూలు, నీటి బిందెలతో భక్తులు స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ నోములు



మాడుగుల గణేష్ కాలనీలో గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: స్థానిక గణేష్ కాలనీలో సోమవారం గౌరీ నెల రోజుల నోములు ఉత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అలాగే ఈ సందర్భంగా గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన మూడు వేలకు పైగా భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ప్రతి ఏటా ఇక్కడ గౌరీ నోములు ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీ.

ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ ఆందోళన

నర్సీపట్నం: దేశ సంపదను బడా కంపెనీలకు దోచిపెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం సీపీఐ నాయకులు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందో ళన నిర్వహించారు. వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ అమెరికాలోని న్యూయర్స్ ఈస్టన్ డిస్ట్రిక్ట్ కోర్టులో అదానీపై అవినీతి కేసు నమోదైందన్నారు. విద్యుత్ ఒప్పందాల కోసం నాలుగు రాష్ట్రాల్లో కోట్లాది రూపాయలు లంచాలుగా ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు.

ఆకట్టుకున్న 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక



స్వప్నం రాల్చిన అమృతం నాటికలోని ఓ సన్నివేశం

మునగపాక: స్థానిక నందీశ్వర తులసీ కళా వేదికపై ఆదివారం రాత్రి ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం'నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. మునగపాకకు చెందిన నాటకరంగ దర్శకుడు, దివంగత మొతిగా సాంబశివరావు సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ఈ నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఒక కాకికి దెబ్బ తగిలి కింద పడిపోతే అన్ని కాకులు చుట్టూ చేరి కావు.. కావు అంటూ అరుస్తాయి. వాటి మధ్య ఏ బంధాలు, సంబంధాలు లేకపోయినా సరే సాటి కాకులుగా గొప్ప సానుభూతిని చూపిస్తాయి. అదే భార్యాభర్తల బంధానికి, అనుబంధానికి విలువనిచ్చే మనుషులం, ఆ కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనలో లేకపోతే ఎలా అని తెలియజెప్పేదే స్వప్నం రాల్చిన అమృతం నాటిక ఇతివృత్తాంతం. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆర్ట్స్ కళాకారులు ఈ ప్రదర్శన నిర్వహించారు. నాటికకు మూల కథ పీఎస్ నారాయణ అందించగా.. పరమాత్ముని శివరాం రచన చేశారు. రమేష్ మంచాల దర్శకత్వం వహించారు.